సాక్షి
వికారాబాద్
మంగళవారం । 14 । మే । 2024



కొడంగల్: పర్సాపూర్ పోలింగ్ బూత్‌ను సందర్శించిన ఎంపీ అభ్యర్థి డీకే అరుణ



అనంతగిరి: వికారాబాద్‌లో తొలిసారి ఓటు వేసిన ఆనందంలో యువతి

న్యూస్‌రీల్

పోలింగ్ ప్రశాంతం: ఎస్పీ



అనంతగిరి: జిల్లాలో ప్రశాంత వాతావరణంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ పూర్తయిందని ఎస్పీ కోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సహకరించిన అన్నిశాఖల అధికారులు, సిబ్బంది, జిల్లా ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

1.50 కోట్ల మంది బస్సుల్లో స్వగ్రామాలకు...

ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

గచ్చిబౌలి: తెలంగాణ వ్యాప్తంగా గడచిన రెండు రోజుల్లో 1.50 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు తమతమ స్వగ్రామాలకు తరలివెళ్లారని తెలంగాణ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వి.సి.సజ్జనార్ తెలిపారు. కొండాపూర్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు 5 వేల టీఎస్ఆర్టీసీ బస్సులను నడిపామని వివరించారు. ప్రస్తుతం వర్కింగ్ డేస్ కావడంతో వెళ్లిన వారంతా ఓటు వేసిన తర్వాత తిరిగి అదే రోజు తిరుగు ప్రయాణంలో కూడా వారికి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరంలోని ఉప్పల్, ఎల్‌బీనగర్, ఆరాంఘర్, సంతోష్‌నగర్, లింగంపల్లి ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచామన్నారు. ఆయా ప్రాంతాలలో ప్రయాణికులకు ఎలాంటి సమస్యలు రాకుండా ఉండేలా అన్ని టెంట్లు ఏర్పాటు చేసి వసతి కల్పించామని ఎండీ వివరించారు. రెండు రోజులుగా డ్రైవర్లు, కండక్టర్లు, ఆఫీసర్లు, సిబ్బంది చాలా కష్టపడ్డారని తెలిపారు. వారందరినీ యాజమాన్యం పక్షాన, సంస్థ పక్షాన అభినందించాల్సిన అవసరం ఉందన్నారు. చాలా ఒత్తిడి ఉన్నా వారంతా ప్రయాణికుల శ్రేయస్సు కోసం చేసిన సేవలు మరువలేనివని వీసీ సజ్జనార్ కొనియాడారు.

అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ విజయం తథ్యం

హైదరాబాద్: అత్యధిక లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వి.సదానంద్ అన్నారు. ఓటర్లంతా కాంగ్రెస్ పక్షాన మొగ్గు చూపారని ఆయన స్పష్టం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఓటింగ్ సరళి చూసిన తరువాత తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేసిన నేపథ్యంలో లబ్ధిపొందుతున్న ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారన్నారు. కాంగ్రెస్ పార్టీకి 12–14స్థానాలు లభించే అవకాశం ఉందని ఆయన అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ తెరవెనుక ఒప్పందాలు కుదుర్చుకోని కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా ఓటర్లు మాత్రం కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారని ఆయన స్పష్టం చేశారు.

ఓటర్లంతా ఊరెళ్లిపోయినందుకేనా..

- లక్షలాదిగా సొంత ఊళ్లకు తరలిన జనం
- గ్రేటర్‌లో 50 శాతంలోపే పోలింగ్

సాక్షి, సిటీబ్యూరో: ఎండలు నిప్పులు చెరగలేదు. వడగాలులు వీచలేదు. వడగండ్ల వానలు లేనేలేవు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నగర వాతావరణం చల్లగానే ఉంది. కానీ పోలింగ్ మాత్రం మందకొడిగానే సాగింది. ప్రతి ఎన్నికల్లో నమోదైనట్లుగానే సాయంత్రం ఐదింటి వరకు 50 శాతం లోపే ఓట్లు పోలయ్యాయి. సాధారణంగా ఈసారి ఎండల కారణంగా సిటీలో ఓటింగ్ తగ్గవచ్చునని విశ్లేషకులు భావించారు. కానీ అందుకు భిన్నంగా వాతావరణం సహకరించింది. అయినప్పటికీ ఓటింగ్ ఆశించిన స్థాయిలో పెరగలేదు. నగరవాసులు పెద్ద ఎత్తున సొంత ఊళ్లకు తరలి వెళ్లడం వల్లనే ఈ సారి ఓటింగ్ శాతం తగ్గిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏపీలో లోక్‌సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు కూడా ఉండడంతో ఆ రాష్ట్రానికి చెందిన నగరవాసులు లక్షలాదిగా తరలి వెళ్లారు. నగరంలో ఓటింగ్ శాతం పెరగకపోవడానికి ఇది ప్రధాన కారణం. అదే సమయంలో తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన నగరవాసు లు కూడా ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు పెద్ద సంఖ్యలోనే సొంత ఊళ్లకు వెళ్లారు. వేసవి సెలవుల కారణంగా చాలా మంది ఇంటిల్లిపాది కలిసి పర్యాటక ప్రాంతాలకు, సొంత ఊళ్లకు వెళ్లిపోయారు. ఓటింగ్ తక్కువగా నమోదు కావడానికి వేసవి సెలవులు కూడా కారణమే.



తాండూరు టౌన్: ఓటు వేసిన శతాధిక వృద్ధురాలు చాంది బీ 102 సంవత్సరాలు



తాండూరు మండలం అంతారంలో బారులుదీరిన ఓటర్లు

పోల్.. కూల్

జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతం

- ధారూరు మండలం అల్లీపూర్‌లో మొరాయించిన ఈవీఎం
- గంట తర్వాత మళ్లీ ప్రారంభం
- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు
- కొడంగల్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

వికారాబాద్: చెదురుమదురు సంఘటనలు మినహా జిల్లాలో సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగినట్లు అధికారులు ప్రకటించారు. ధారూరు మండలం అల్లీపూర్‌లో మధ్యాహ్నం ఈవీఎం మొరాయించగా సరి చేశారు. గంట తర్వాత పోలింగ్ మళ్లీ ప్రారంభమయ్యింది. సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో సహా జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు వారివారి ప్రాంతాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎక్కడా అల్లర్లు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఎన్నికలు ముగిసే సమయానికి 68 శాతం ఓటింగ్ నమోదయ్యింది. సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ బూత్ ఆవరణలో ఉన్నవారందరూ ఓటు వేసేలా చేస్తామని అధికారులు తెలిపారు.కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

ఓటు వేసిన ప్రముఖులు

జిల్లాలో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి కొడంగల్‌లో ఓటు వేశారు. మర్పల్లి మండల కేంద్రంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఓటేశారు. తాండూరులో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, వికారాబాద్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. యాలాల మండలం దౌలాపూర్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ఓటు వేశారు. దోమ మండలం శివారెడ్డిపల్లిలో పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. తాండూరులో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఓటు వేశారు. మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్(వికారాబాద్‌లో), మహేశ్‌రెడ్డి(పరిగిలో) కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు.

భారీ బందోబస్తు ఏర్పాటు

జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ అసెంబ్లీ సెగ్మెంట్లలో మొత్తం 9,83,740 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 4,85,748, మహిళలు 4,97,957, ట్రాన్స్ జెండర్లు 35 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,148 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి పోలింగ్ నిర్వహించారు. సమస్యాత్మక కేంద్రాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ సరళిని వీడియో రికార్డింగ్ చేశారు.

పోలింగ్ సరళి పరిశీలన

అనంతగిరి: జిల్లాలో ఓటింగ్ సరళిని వ్యయ పరిశీలకులు రాజీవ్ చావ్రా పరిశీలించారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్‌లో ఓటింగ్‌ను పరిశీలించారు.



కొడంగల్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి ముందు సంతకం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

68 శాతం పోలింగ్

జిల్లాలో 68 శాతం పోలింగ్ నమో దైంది. పరిగిలో 66 శాతం, వికారాబాద్‌లో 70 శాతం, తాండూరులో 67.30శాతం, కొడంగల్‌లో 70శాతం పోలింగ్ నమోదైంది.వేసవి కావడంతో ఉదయమే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. మధ్నాహ్నం అవుతున్న కొద్దీ కాస్త నెమ్మదించింది. సోమవారం ఎండ కాస్త తక్కువగానే ఉండటంతో జనాలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం 7నుంచి 9గంటల వరకు 11శాతం, 11గంటల వరకు 26 శాతం, ఒంటి గంటవరకు 45 శాతం, 3గంటల వరకు 56శాతం, సాయంత్రం 5గంటల వరకు 64.44 శాతం ఓటింగ్ నమోదవ్వగా పోలింగ్ ముగిసే సమయానికి 68శాతం నమోదైంది.



మర్పల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, నాయకులు



చేవెళ్ల మండలం గొల్లపల్లిలో ఓటు వేసి సిరా మరక చూపుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



మొయినాబాద్ మండలం ఎనికేపల్లిలో ఓటు వేసిన రంజిత్‌రెడ్డి



యాలాల మండలం దౌలాపూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న సునీతారెడ్డి



దోమ: పాలేపల్లిలో వృద్ధురాలు



వికారాబాద్‌లో ఓటు వేసిన కలెక్టర్ దంపతులు



యాలాల: ఓటేసిన వరుడు సయ్యద్ ఇమ్రాన్



దోమ: ఐనాపూర్ పోలింగ్ కేంద్రం వద్ద క్యూ ఉండటంతో టెంట్ కింద సేద తీరుతున్న ఓటర్లు



నాయకులను సముదాయిస్తున్న పోలీసులు

మీర్‌పేటలో టెన్షన్ టెన్షన్

- డబ్బులు పంచుతున్నారంటూ కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల ఘర్షణ
- టెంట్లు ధ్వంసం, రోడ్డుపై బైఠాయించి నిరసన
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన గొడవ

మీర్‌పేట: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా సోమవారం మీర్‌పేట కార్పొరేషన్ సిర్లాహిల్స్ పోలింగ్ కేంద్రం వద్ద బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. కాంగ్రెస్ నాయకులు ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపించడంతో ఇరువర్గాల నేతలు ఒకరినొకరు దూషించుకున్నారు. అక్కడ ఉన్న టెంట్లను ధ్వంసం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను అక్కడి నుంచి చెదరగొట్టారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు పార్టీల నాయకులను సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది.

ఎవరి ధీమా వారిదే..

- కాంగ్రెస్, బీజేపీల మధ్యే ప్రధాన పోటీ!
- చివరి నిమిషంలో చేతులెత్తేసిన బీఆర్ఎస్
- బూత్‌ల వారీగా ఓటింగ్ సరళిపై ఆరా..



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల్లో గెలుపుపై ఎవరికీ వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగిన ఓటింగ్ సరళిని బట్టి చూస్తే చేవెళ్ల లోక్‌సభ స్థానంలో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్యే ప్రధానంగా పోటీ కన్పిస్తోంది. నేనే గెలవబోతున్నానని ఒకరు అంటే..కాదు నేనే గెలుస్తానంటూ మరొకరు ధీమాగా ఉన్నారు. మైనార్టీల, మహిళల ఓట్లు గంపగుత్తగా తమకే పడ్డాయని.. ఈ ఓట్లు తమను గట్టెక్కిస్తాయని కాంగ్రెస్ చెబుతుండగా, ఐటీ ఉద్యోగులు, యువత, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న చిరుద్యోగులు, పట్టణ ఓటర్లు కమలం వైపు మొగ్గుచూపినట్లు ఆ పార్టీ చెబుతోంది. బీఆర్ఎస్ ఓటుబ్యాంకు కూడా బీజేపీ వైపు మళ్లిందని ఆ పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ముస్లిం రిజర్వేషన్ల ఎత్తివేత అంశం సహా ఆరు గ్యారంటీల హామీ, సీఎం రేవంత్‌రెడ్డి సుడిగాలి పర్యటనలు కాంగ్రెస్‌కు కలిసివస్తాయని ఆ పార్టీ భావిస్తోంది. దీనికితోడు చివరి నిమిషంలో నిర్వహించిన పోల్‌మేనేజ్‌మెంట్ కూడా ఇందుకు దోహదం చేస్తుందని వారు ధీమాగా ఉన్నారు. ఇదిలా ఉంటే గత రెండు ఎన్నికల్లోనూ హవా కొనసాగించిన బీఆర్ఎస్ ఆఖరి నిమిషంలో చేతులెత్తేసింది. బీసీ కార్డు ఆశించిన స్థాయిలో పనిచేయకపోగా, మెజార్టీ మండలాల్లో బీఆర్ఎస్ ఓట్లు కూడా బీజేపీకి డైవర్ట్ అయినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం పరిధిలోని షాద్‌నగర్‌లోనూ బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్యే ప్రధానంగా పోటీ నెలకొంది. షాద్‌నగర్ పట్టణం సహా గ్రామీణ ప్రాంతాలు సైతం బీజేపీ వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఇక భువనగిరి లోక్‌సభ స్థానం బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన క్యామ మల్లేశ్ జిల్లా వాసి అయినప్పటికీ ఆఖరి నిమిషంలో ఆయన కూడా చేతులెత్తేసినట్లు తెలిసింది. బీఆర్ఎస్ కేడర్‌లో చీలిక వచ్చి.. కొంతమంది కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా, మరికొంత మంది బూర నర్సయ్యగౌడ్‌కు మద్దతుగా నిలిచినట్లు తెలుస్తోంది. మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం పరిధిలోని ఎల్బీనగర్‌లోని మెజార్టీ ఓటర్లు కమలం వైపు మొగ్గు చూపినట్లు తెలిసింది. దీంతో ఆ పార్లమెంట్ స్థానంలో బీజేపీ నుంచి పోటీలో ఉన్న ఈటల రాజేందర్ గెలుపు దాదాపు ఖాయమేనని ఆ పార్టీ వర్గాలు తెలుపుతున్నాయి. ఇక నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం పరిధిలోని కల్వకుర్తిలోనూ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య పోటీ నెలకొంది. ఇక్కడ ఎవరికి వారు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

బార్డర్ దాటారంటూ..

పర్వేద పోలింగ్ కేంద్రం వద్ద స్వల్ప లాఠీచార్జి

చేవెళ్ల: శంకర్‌పల్లి మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో 72.14శాతం పోలింగ్ నమోదైంది. మాసానిగూడలో కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ గ్రామస్తులతో కలిసి ఓటు వేశారు. అక్కడే గ్రామస్తులతో కలిసి ఓటింగ్ తీరును చర్చించారు. మండలంలోని పర్వేద పోలింగ్ కేంద్రం వద్ద పలు రాజకీయ పార్టీల నాయకులు ఒక్కసారిగా గుమ్మిగూడి పోలీసులు నిర్దేశించిన బార్డర్ దాటి వచ్చారు. దీంతో పోలీసులు వారిని దూరంగా పోవాలని చెప్పినా వినకపోవటంతో శంకర్‌పల్లి డీఐ ఇన్‌స్పెక్టర్ నాగరాజు సిబ్బందితో కలిసి లాఠీ చార్జి చేసి చెదరగొట్టారు. దీంతో వారంతా ఆందోళన చేశారు. దీంతో కాసేపు స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని దీనిని ఎవరు అతిక్రమించవద్దని హెచ్చరించారు. ఈ విషయాన్ని చెప్పకుండా పోలీసులు లాఠీచార్జి చేయటం సరైనది కాదని మండి పడ్డారు. పోలీసులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము పోలింగ్ కోసమే వచ్చామని ఇలా కొట్టడమేమిటని ప్రశ్నించారు. పలువురు నాయకులు, పోలీసులు సర్ది చెప్పటంతో సమస్య సద్దుమణిగింది. అనంతరం ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించారు.

ఓటు వేసిన మాజీ మంత్రి



ఓటు వేసిన అనంతరం దేవేందర్‌గౌడ్, ఆయన కుటుంబ సభ్యులు

తుక్కుగూడ: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో మాజీ హోంశాఖ మంత్రి తూళ్ల దేవేందర్‌గౌడ్ ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాస్వామంలో ఓటు అత్యంత విలువైన ఆయుధమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఓటు వేసి.. తల్లి అంతిమ యాత్ర నిర్వహించి



ఓటు వేసిన మాసప్ప

తాండూరు: తల్లి ఇంట్లో విగత జీవిగా మారింది. మరికాసేపట్లో ఆమెకు అంతిమ సంస్కారాలు నిర్వహించాలి. కానీ ఓ కొడుకు ఓటు హక్కును వినియోగించి అనంతరం తల్లికి అంత్యక్రియలు చేశారు. తాండూరు మున్సిపల్ పరిధిలోని 11వ వార్డుకు చెందిన మాసప్ప తల్లి ఆదివారం రాత్రి మరణించింది. ఈ విషయం తెలుసుకున్న బంధువులు ఇంటికి తరలి వచ్చారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించేందుకు అంతా సిద్ధం చేశారు. అయితే తల్లి మృతదేహం ఇంట్లో ఉండగానే ప్రభుత్వ నంబర్–1 పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో మాసప్ప తన కొడుకుతో కలిసి వచ్చి ఓటు వేశాడు. మధ్యాహ్నం 2 గంటలకు తల్లి మృతదేహాన్ని అంతిమ యాత్ర నిర్వహించారు. ఈ విషయం తాండూరు పట్టణంలో చర్చనీయాంశమైంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మరో ఇద్దరికి గాయాలు



విష్ణువర్ధన్‌గౌడ్ (ఫైల్)

దౌల్తాబాద్: మండలంలోని బిచ్చాల గ్రామానికి చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌గౌడ్(20), భాస్కర్, రవిలు ఓకే బైక్‌పై కోస్గి పట్టణానికి స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా ముశ్రీఫా గ్రామ సమీపాన బైక్ అదుపుతప్పి ఓ చెట్టుకు ఢీకొట్టడంతో విష్ణువర్ధన్‌గౌడ్ అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడు హైదరాబాద్‌లో ఓ కంపెనీలో పనిచేస్తుండేవారు. రెండు నెలలుగా ఇంటి దగ్గరనే ఉంటున్నారు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటిపోయాయి. బైక్‌పై ఉన్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం కోస్గి ఆస్పత్రికి తరలించారు.

ఈవీఎంల మొరాయింపు

బడంగ్‌పేట్ పరిధిలో ఆలస్యంగా ప్రారంభమైన పోలింగ్

బడంగ్‌పేట్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా సోమవారం బడంగ్‌పేట మున్సిపాలిటీలోని 235, 237 పోలింగ్ బూతులను స్థానికంగా ఉన్న శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన ఓటింగ్ ప్రక్రియ ఈవీఎంలు మొరాయించడంతో రెండు చోట్ల 50 నిమిషాలు ఆలస్యంగా మొదలయ్యాయి. టెక్నీషియన్ వచ్చి మరమ్మతు చేసేవరకు ఓటర్లు క్యూలైన్‌లోనే పడిగాపులు కాశారు. అనంతరం వారు ఓటు హక్కును వినియోగించుకున్నారు. బాలాపూర్ మండలంలోని అల్మాస్‌గూడ, బాలాపూర్, నాదర్‌గుల్, వెంకటాపూర్, మామిడిపల్లిలో పరిధిల్లోని పోలింగ్ బూత్‌ల్లో ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటర్ల అవస్థలు

- మొరాయించిన ఈవీఎంలు
- అల్లిపూర్‌లో గంట వరకు ఆగిన పోలింగ్
- క్యూలైన్‌లో నిరీక్షించిన వృద్ధులు, మహిళలు



ఓట్లు వేసేందుకు నిరీక్షిస్తున్న ఓటర్లను సముదాయిస్తున్న సీఐ రామకృష్ణ

ధారూరు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అల్లిపూర్ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం గంటపాటు పోలింగ్ నిలిచిపోయింది. కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లతో పాటు వీవీ ప్యాట్(ఈవీఎం)లు ఒక్కసారిగా మొరాయించాయి. మధ్యాహ్నం 3:10 గంటలకు ఆగిన వీటిని సరిచేయడానికి టెక్నికల్ సిబ్బంది అరగంట పాటు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. తర్వాత ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. సెక్టోరియల్ ఆఫీసర్ శర్బలింగం తన వాహనంలో సీయూ, బీయూ, వీవీ ప్యాట్‌లను తీసుకురాగా టెక్నికల్ సిబ్బంది అమర్చి సాయంత్రం 4:10 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించిన తర్వాత ఓటర్లకు అవకాశం కల్పించారు. పోలింగ్ ఆగిన విషయాన్ని తెలుసుకున్న ధారూరు సర్కిల్ సీఐ రామకృష్ణ, తహసీల్దార్ సాజిదాబేగం అల్లిపూర్ చేరుకుని పోలింగ్ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నారు. వీరితో పాటు ప్రత్యేక పోలీసులు అక్కడికి చేరుకుని ఎవరూ గుమిగూడకుండా బందోబస్తు చేశారు. కాగా మొరాయించిన కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లను ప్యాక్ చేసి సీల్ వేశారు. వీటిలో పడిన ఓట్లు ఎక్కడికీ పోవని, మీరు వేస్తున్న మిగిలిన ఓట్లు రెండో ఈవీఎంలో నిక్షిప్తమవుతాయని సెక్టోరియల్ ఆఫీసర్ శర్బలింగం ఓటర్లకు వివరించారు.

గంటపాటు నిరీక్షణ

కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్‌లు మొరాయించడంతో ఓట్లు వేయడానికి వచ్చిన వృద్ధులు, మహిళలు గంటపాటు నిరీక్షించారు. మిషన్లు మొరాయించాయని తెలుసుకున్న ఇతర గ్రామస్తులు ఇళ్లలోనే ఉండిపోయారు. ఈ బూత్‌లో మొత్తం 956 ఓట్లు ఉండగా 3:10 గంటల వరకు 631 ఓట్లు పోలయ్యాయి. ఓటింగ్ గంటపాటు నిలిచిపోయినందున మరో గంట అదనపు సమయం కేటాయించాలని ఓటర్లు సెక్టోరియల్ ఆఫీసర్ శర్బలింగాన్ని కోరారు. అదనపు సమయం కేటాయించేందుకు వీలుండదని సాయంత్రం 6 గంటల వరకు ఎంతమంది ఓటర్లు పోలింగ్ బూత్ ఆవరణలోకి ఉంటారో వారందరూ ఓట్లు వేసేలా చూస్తామని నచ్చజెప్పారు.



ఓపిక లేక కేంద్రంలో కూర్చున్న ఓటర్లు



మొరాయించిన ఈవీఎంను మరమ్మతు చేస్తున్న టెక్నికల్ సిబ్బంది

నాగసమందర్‌లో..

మండల పరిధిలోని నాగసమందర్‌లోని ఓ బూత్‌లో బ్యాలెట్ యూనిట్ సమస్యరావడంతో 10 నిమిషాల పాటు ఓటింగ్ ఆగిపోయింది. ఆ సమయంలో ఓ వృద్ధుడు బ్యాలెట్ యూనిట్ బటన్ నొక్కి పట్టడంతో అది తిరిగి పైకి రాలేదు. టెక్నీషియన్లు దానిని సరిచేయడానికి 10 నిమిషాల సమయం తీసుకున్నారు. అనంతరం ఓటింగ్ ప్రారంభమైంది.

అకాల వర్షం.. రైతన్నకు కష్టం

బెన్నూరు కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

యాలాల: మండల పరిధిలో సోమవారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. దీంతో బెన్నూరు గ్రామ శివారులో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన వరి ధాన్యం పూర్తిగా తడిసింది. కొందరు రైతులు కవర్లు కప్పి ఉంచినప్పటికీ, ధాన్యం రాశుల కిందకు వరద నీరు చేరింది. దీంతో ఆ నీటిని దిగువకు పారించేందుకు రైతులు అవస్థలు పడ్డారు. విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం తడిసిపోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.



కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశుల వద్ద వరదనీటిని తొలగిస్తున్న రైతులు



ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

ఓటు హక్కును వినియోగించుకున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



కల్‌ఖోడలో..



కోట్‌మర్పల్లిలో ఓటు వేసిన కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో 58 పోలింగ్ కేంద్రాలలో 44,610 మంది ఓటర్లు ఉండగా ఇందులో 31,795 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దాదాపు 71.27 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తహసీల్దార్ గణేష్ తెలిపారు. మండల కేంద్రంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఓటు హక్కు వినియోగించుకోగా మండల పరిధిలోని పంచలింగాల గ్రామంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సనగారి కొండల్‌రెడ్డి ఓటు వేశారు.



పంచలింగాలలో ఓటు హక్కును వినియోగించుకున్న కొండల్‌రెడ్డి

తాండూరులో 67 శాతం పోలింగ్

తాండూరు: తాండూరు నియోజకవర్గంలో సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. తాండూరు అసెంబ్లీ పరిధిలో మొత్తం 67శాతం పోలింగ్ నమోదైంది. అసెంబ్లీ పరిధిలో మొత్తం 2,43,192 ఓటర్లు ఉండగా అందులో 1,63,769 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వినియోగించుకున్న వారిలో 81,248 మంది పురుషులు, 82,518 మంది మహిళలు, థర్డ్ జెండర్‌లు ముగ్గురు ఉన్నారు.

వృద్ధురాలు కింద పడ్డారని..

అద్దె బస్సు అద్దం ధ్వంసం చేసిన స్థానికులు



దాడిలో పగిలిన బస్సు అద్దం

యాలాల: మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్‌లో సోమవారం మధ్యాహ్నం ఆర్టీసీ అద్దె బస్సు అద్దాలను కొందరు ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు డిపో నుంచి ఓ ఆర్టీసీ అద్దె బస్సు మహబూబ్‌నగర్‌కు వెళుతుంది. లక్ష్మీనారాయణపూర్ సమీపంలోకి రాగానే ఓ వృద్ధురాలు బస్సు దిగేందుకు యత్నిస్తుండగా కిందపడింది. దీంతో కోపోద్రిక్తులైన స్థానికులు బస్సు ముందు అద్దాన్ని పగులగొట్టారు. కాగా అదే మార్గంలో ఎన్నికల సరళిని పరిశీలించేందుకు వెళుతున్న రూరల్ సీఐ అశోక్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని ఘర్షణను సద్దుమణిగించారు.

మొదటిసారి.. నవతరం గురి

ఓటు వేసేందుకు కదిలిన యువత

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అనేది ఎంతో కీలకం. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు భారత ఎన్నికల సంఘం ఓటు హక్కు కల్పిస్తుంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువత సంతోషాన్ని వ్యక్తం చేశారు. చట్టసభల్లో ప్రజాప్రతినిధిని తొలిసారి ఎన్నుకునే అవకాశం రావడంతో కొత్త ఓటర్లు ఆనందాన్ని పంచుకున్నారు.

స్వేచ్ఛగా ఓటేశా



ఈ సారి నాకు కొత్తగా ఓటు వచ్చినందుకు సంతోషంగా ఉంది. కుటుంబ సభ్యులతో కలిసి పోలింగ్ కేంద్రానికి వచ్చి మంచి నాయకుడిని ఎన్నుకున్నాను. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా నా బాధ్యతను నిర్వర్తించాను.

– శ్వేత, కిషన్‌నగర్, షాద్‌నగర్

నా ఓటు.. మార్పునకు నాంది



నేను మొదటిసారి ఓటు వేసి నా ఓటు హక్కును వినియోగించుకున్నా. ఎవరెన్ని చెప్పి నా బాధ్యతగా నాకు నచ్చిన అభ్యర్థికి ఓటువేశా. అభివృద్ధి చేసే నాయకుడు గెలుపొందుతారని కోరుకుంటున్నా. యువతలో మార్పు రావాలి. ఎన్నికల్లో గెలిపొందిన వారు స్థానిక సమస్యలను పరిష్కరించడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. సమాజంలో మార్పు తీసుకురావాలి.

– పూర్ణచందర్‌రావు, తాళ్లపల్లి, షాబాద్

ఎంతో సంతోషంగా ఉంది



ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో విలువ ఉంది. ఓటు హక్కు పొంది మొదటిసారిగా ఓటు వేసినందుకు చాలా సంతోషంగా ఉంది. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకున్నాను. ప్రజాస్వామ్యం కాపాడే విలువలున్న నాయకుడికే ఓటేశాను.

– ఐశ్వర్య, ఎలికట్ట, ఫరూఖ్‌నగర్

తొలిసారి.. ఓటరుగా మారి



ఓటు హక్కు వచ్చిన తరువాత తొలిసారి ఓటు వేశాను. ప్రజాస్వామ్య దేశంలో ఓటు ఎంతో విలువైనది. అలాంటి ఓటును తొలిసారి వినియోగించుకున్నాను. మొదటిసారి ఓటు వేయడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని స్వేచ్ఛగా ఎన్నుకోవాలని కోరుతున్నాను.

– సదాఫ్, విద్యార్థిని, ఆమనగల్లు

షాద్‌నగర్.. పోలింగ్ ప్రశాంతం

- కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు



కిషన్‌నగర్‌లో వృద్ధురాలికి తీసుకెళ్తున్న కానిస్టేబుల్

షాద్‌నగర్, షాద్‌నగర్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత మధ్య పోలింగ్ నిర్వహించారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ, కేశంపేట, ఫరూఖ్‌నగర్, నందిగామ నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎండల నేపథ్యంలో షాద్‌నగర్ పట్టణంతో పాటుగా పలు గ్రామాల్లో ఉదయం 6.30 గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు ఓటు వేసేందుకు వచ్చారు. సాయంత్రం ఆరు గంటలు దాటిన తర్వాత అధికారులు పోలింగ్ కేంద్రానికి సంబంధించిన గేట్లను మూసి వేశారు. పోలింగ్ కేంద్రానికి సమయానికి వచ్చిన వారిని అధికారులు ఓటు వేసేందుకు అనుమతించారు.

ఆలస్యంగా పోలింగ్

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని పీర్లగూడ, ఎలికట్ట, షాద్‌నగర్ పట్టణంలోని 247 పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించాయి. పీర్లగూడలో ఈవీఎం మొరాయిచడంతో పోలింగ్ అరగంట ఆలస్యంగా ప్రారంభం అయ్యింది. అదేవిధంగా ఎలికట్టలో పోలింగ్ మధ్యలోనే ఈవీఎం మొరాయించడంతో ఓట్లు వేసేందుకు వచ్చిన వారు కొందరు పోలింగ్ కేంద్రం నుంచి వెనుదిరిగారు. దీంతో సుమారు 40 నిమిషాల పాటు పోలింగ్ నిలిచింది. అనంతరం అధికారులు ఈవీఎంలను సరి చేశారు.

ప్రముఖుల సందడి

షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి తన స్వగ్రామమైన దూసకల్ గ్రామంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. షాద్‌నగర్ పట్టణంలోని వెంకటేశ్వర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పరిశీలించిన డీసీపీ

ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, పట్టణ సీఐ ప్రతాప్‌లింగం ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫరూఖ్‌నగర్ ఉన్న పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి పరిశీలించారు.



కిషన్‌నగర్‌లో ఓటు వేసేందుకు లైన్‌లో నిలబడిన మహిళలు



కంసాన్‌పల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న గ్రామస్తులు

కొడిచర్లతండా ఓటర్ల నిరసన



కందుకూరు: ఓటు వేయకుండా రోడ్డుపై నిరసన తెలుపుతున్న ఓటర్లు



కొత్తూరు: ఓటర్లతో చర్చిస్తున్న పోలీసులు, ఎన్నికల అధికారులు

- పోలింగ్ కేంద్రం, రేషన్ షాపు కోసం రోడ్డుపై బైఠాయింపు
- అధికారుల హామీతో సద్దుమణిగిన వ్యవహారం

కొత్తూరు: తమ సమస్యలను పరిష్కరించాలని లోక్‌సభ ఎన్నికల పోలింగ్ వేళ కొత్తూరు మండలం కొడిచర్ల తండా ఓటర్లు ఆందోళన చేపట్టారు. నూతనంగా ఏర్పడిన తమ గ్రామ పంచాయతీలో పోలింగ్ కేంద్రం, రేషన్ దుకాణాలను ఏర్పాటు చేసే వరకు ఓటు వేయబోమని సోమవారం నిరసనకు పూనుకున్నారు. ఓ వైపు పార్లమెంట్ ఎన్నికలు జరుగుతుండడం.. తండా ఓటర్లు పోలింగ్ కేంద్రానికి సమీపంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపడంతో అధికారులు వెంటనే స్పందించారు. మండల ఎన్నికల అధికారులు, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఈ మేరకు ఓటర్లు తమ సమస్యలను వారికి విన్నవించారు. తండా నుంచి పోలింగ్ కేంద్రం సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. తండా పంచాయతీగా రూపాంతరం చెందిన తర్వాత కూడా రేషన్ దుకాణం ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రతినెలా నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొడిచర్ల గ్రామానికి వెళ్లి సరుకులు తీసుకోవాల్సి వస్తుందని వాపోయారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా తండాలోనే రేషన్ దుకాణం, పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని గత కొన్నేళ్లుగా అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు తండావాసుల సమస్యను ఉన్నతాధికారులకు నివేదించారు. త్వరలోనే రేషన్ దుకాణం ఏర్పాటుకు కృషి చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో తండావాసులు ఆందోళన విరమించారు. అనంతరం వారికి వాహనాలు ఏర్పాటు చేసి పోలింగ్ కేంద్రానికి వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నారు.



కందుకూరు: కూర్చొన్న వృద్ధులు, మహిళలు

పోలింగ్ బూత్ ఏర్పాటుకు నిరసన

కందుకూరు: తమ గ్రామంలోనే పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని గతంలో ఎన్నిసార్లు వినతులు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో మండల పరిధిలోని తిమ్మాపూర్ అనుబంధ గ్రామం చీమలవానికుంట ఓటర్లు నిరసన చేపట్టారు. ఈ మేరకు ఓటు వేయకుండా సోమవారం గ్రామంలోనే బైఠాయించారు. చీమలవానికుంట గ్రామం తిమ్మాపూర్ నుంచి దాదాపుగా మూడు కిలోమీటర్ల మేర దూరంలో ఉంటుంది. దాదాపుగా 350 మంది వరకు ఓటర్లు ఉన్నారు. కాగా పోలింగ్ బూత్‌ను గతంలో తమ గ్రామంలోనే ఏర్పాటు చేయాలని గ్రామస్తులు వినతులు చేసినా ఉపయోగంలేదు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లో సైతం చీమలవానికుంట ఓటర్లకు తిమ్మాపూర్‌లోనే పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడి నుంచి మూడు కిలోమీటర్ల మేర దూరంలో ఉన్న పోలింగ్ బూత్‌కు 350 మంది వరకు ఓటర్లు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాలి. దీంతో వారు సోమవారం ఉదయం 8 గంటల నుంచి గ్రామంలో రోడ్డుపై బైఠాయించి ఓటు వేయమంటూ నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డితో పాటు ఎన్నికల అధికారులు వారి వద్దకు వెళ్లి భవిష్యత్ ఎన్నికల్లో పోలింగ్ బూత్ ఇక్కడే ఏర్పాటు చేయిస్తామని హామీ ఇవ్వడంతో మధ్యాహ్నం 12 గంటల సమయంలో నిరసన విరమించి సొంత వాహనాల్లో ఓటు వేయడానికి పోలింగ్ బూత్‌కు తరలివెళ్లారు.